క్లుప్తంగా

గూడెంలో డీపీవో పర్యటన


డ్రెయినేజీని పరిశీలిస్తున్న డీపీవో

దండేపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని డీపీవో వెంకటేశ్వర్లు పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలంలోని గూడెం గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. జీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వీధులు, డ్రెయినేజీలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కిరాణా దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ వస్తువులు బయట పడేయకూడదని, ప్లాస్టిక్ సంచులు వాడకూడదని, అట్లాగే నిషేధిత వస్తువులు కూడా దుకాణాల్లో అమ్మరాదని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డును తనిఖీ చేసి, గ్రామంలో సేకరించిన చెత్తలోంచి, ప్లాస్టిక్, గాజు సీసాలను వేరు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి


లేఖ చూపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో బీసీల సమస్యలపై మంగళవారం బహిరంగ లేఖను విడుదల చేశారు. లేఖను బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి సీనియర్ నాయకులు కర్రె లచ్చన్న, శాకపూరి భీంసేన్, చంద్రగిరి చంద్రమౌళి, ఆరెందుల రాజేశం, కిషోర్, రాష్ట్ర కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి


ఆందోళన చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: వందేభారత్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

చెన్నూర్‌రూరల్: వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని అక్కెపల్లిలో మంగళవారం డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దింటి రాజన్న, మాజీ ఎంపీటీసీ సిడాం పోశం, ఈజీఎస్ ఎఫ్ఏ ఎర్రయ్య, బేస్ క్యాంపు వాచర్స్, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్‌తో తనిఖీ


డాగ్‌తో తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సైలు

బెల్లంపల్లి: గంజాయిని నిర్మూలించడమే లక్ష్యంగా బెల్లంపల్లి పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. బెల్లంపల్లి టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం సాధారణ తనిఖీలకు భిన్నంగా నార్కోటిక్ డాగ్ ద్వారా గంజాయి సేవించే వ్యక్తుల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి హడలెత్తించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో రడగంబాల బస్తీ, నంబర్-2 ఇంక్లైన్ బస్తీ, గంగారాం నగర్‌లలో విస్తృతంగా తనిఖీలు చేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గలు ఎలుగుతలెవ్..!


టేకుల బస్తీలోని వీధిలో బుగ్గలు వెలగక అలుముకున్న చీకటి

- వీధి దీపాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- పనిచేస్తలేవని చెప్పినా పట్టించుకుంటలేరని పురప్రజల ఆరోపణ

బెల్లంపల్లి: బల్దియాలో వీధి దీపాల ఏర్పాటులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మున్సిపాలిటీలో 34 వార్డులుండగా, పలు వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. 15వ వార్డు టేకుల బస్తీలోని ఓ వీధిలో నాలుగు రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. పది స్తంభాల బల్బులు పనికి రాకుండా పోయాయని బస్తీ వాసులు చెబుతున్నారు. ఓ స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి కరెంట్ తీగ కాలిపోవడంతో వీధి దీపాలు పనిచేయకుండా పోగా, ప్రస్తుతం ఆ వీధి ప్రజలు చీకట్లో ఉంటున్నారు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్ బస్తీ, అంబేద్కర్ నగర్, రవీందర్‌నగర్, 65 డీప్ ఏరియా, సుభాష్‌నగర్, హన్మాన్‌బస్తీ, రాంనగర్, అశోక్ నగర్, బజారు ఏరియా, షంషీర్ నగర్, కొత్త బస్టాండ్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు సరిపడా వీధి దీపాలు ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని బస్తీల్లో బల్బ్‌లు కాలిపోయి రోజులు గడుస్తున్నా, కొత్తవాటిని ఏర్పాటు చేయట్లేదని స్థానికులు వాపోతున్నారు.

శివారు ప్రాంతాల్లో...

మున్సిపల్ శివారు ప్రాంతాల పరిస్థితులు మరింత దయనీయంగా ఉన్నాయి. ముఖ్యంగా స్ట్రీట్ లైట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఎప్పుడో ఓసారి బల్బ్‌లను స్తంభాలకు బిగించడం తప్పా, నెలలు గడిచినా కానీ అటువైపు తొంగి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఏదో ఒక తీరుగా బల్బ్‌లు పనిచేయకుండాపోయి అలంకారప్రాయంగా ఉంటున్నాయని, ఇతర వార్డులతో పోల్చితే సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నట్లు శివారు ప్రాంతాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

కరువైన పర్యవేక్షణ..

వీధి దీపాలు, కరెంట్ సమస్యలపై మున్సిపల్ యంత్రాంగం సరిగ్గా స్పందించడం లేదు. ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలగడం లేదు, ఏ వార్డులో ఎలాంటి కరెంట్ సమస్యలు ఉంటున్నాయో గుర్తించి చర్యలు తీసుకోవడం లేదు. రోజువారీగా పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా అశ్రద్ధ వహిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీలో కరెంట్ సమస్యలు, బల్బ్‌లు వెలగని పరిస్థితులు ఉంటున్నాయి. నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని పురప్రజలు కోరుతున్నారు.

బతుకమ్మ ఆడలేక పోతున్నాం



నాలుగు దినాల సంది కరెంట్ బుగ్గలు ఎల్గుతలేవ్. బుగ్గలు కాలిపోయిన సుత మున్సిపాల్టోల్లు పట్టించుకుంటలేరు. చీకట్ల ఉంటున్నం. పాములు, తేళ్లు ఇళ్లల్లకు అత్తన్నయ్. ఏడాదికోసారి ఆడుకునే బతుకమ్మ సుత ఆడుతలేం. బల్బ్‌లు ఎల్గని, కరెంట్ లేని గోసను ఎవలకు చెప్పుకున్నా సుత తీర్తలేదు. గిట్ల పట్టింపు జేయకుండా ఉండుడు మంచిది కాదు. సార్లు ఇసారం జేసి బుగ్గలు ఎల్గేటట్లు సూడాలే.

– దొడ్డి పద్మ, టేకుల బస్తీ

పర్యవేక్షించడం లేదు



మున్సిపాలిటీలో విద్యుత్ సమస్యలు, బల్బ్ లు సరిగా వెలగకుండా ఉన్నా అధికా రులు, ప్రజా ప్రతిని ధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం నెలకోసారి కూడా వార్డులకు రావ డం లేదు. కరెంట్ సమస్యలను పర్యవేక్షించడం లేదు. ఓట్లప్పుడు తప్పా, తిరిగి బస్తీల ముఖం చూడటం లేదు. ఇప్పటికైనా పట్టింపు చేసి చర్యలు తీసుకోవాలి.

– పైడిమల్ల చంద్రశేఖర్, టేకుల బస్తీ

ప్రస్తుతం బల్బులు లేవు..



మున్సిపాలిటీలో ప్రస్తుతం విద్యుత్ బల్బ్‌లు లేవు. సరఫరా కోసం తాజాగా ఇండెంట్ పంపించాం. ప్రస్తుతానికి ఎక్కడైతే కరెంట్ బల్బ్‌లు కాలిపోయాయో వాటిని సిబ్బందితో రిపేరు చేయిస్తున్నాం. కాలిపోయిన బల్బ్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేకపోతున్నాం. కొత్త బల్బ్‌లు రాగానే అవసరమున్న ప్రతిచోటా ఏర్పాటు చేయిస్తాం. త్వరలోనే బల్బ్‌లు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

సంస్థ పురోగతిని ఉద్యోగులకు తెలియజేయాలి

- జీఎం సంజీవరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ పురోగతిని ఉద్యోగులకు తెలియజేయాలని అధికారులకు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీ సాధిస్తున్న ప్రగతిని కార్మికులు గనుల వారీగా తెలియజేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంస్థ సాధించిన ప్రగతి, ఉద్యోగులకు చేస్తున్న సంక్షేమం, లాభాల వాటా, మున్ముందు కంపెనీ ఎలా విస్తరించిపోతుందో వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఓసీపీ అధికారులు శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, శ్రీధర్, డీజీఎంలు చిరంజీవులు, రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు బతుకమ్మ ఆటపాట

బొగ్గుబాయి వార్తలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని కృష్ణాకాలనీ శాంతి మైదానంలో గురువారం సింగరేణి ఆధ్వర్యంలో బతుకమ్మ ఆట పాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని ఉద్యోగుల కుటుంబ సభ్యులు, పరిసరాల గ్రామాల మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉత్తమ బతుకమ్మ, మొదటగా వచ్చిన బతుకమ్మలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణ కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాదారం టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో ఈ నెల 10న సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తుండగా, బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఎస్‌ఓటు జీఎం రాయమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అందమైన బతుకమ్మలు అలంకరించి తీసుకొచ్చే మహిళలకు సింగరేణి తరఫున బహుమతులు అందజేయనున్నట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు మొగిలి, ఎం.రామారావు, సివిల్ విభాగం అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఉద్యోగినులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సెంట్రల్ నర్సరీలో బుధవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. జీఎం కార్యాలయం ఉద్యోగినులు, అధికారులు బతుకమ్మ ఆడారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం సంజీవరెడ్డి హాజరయ్యారు. సేవా అధ్యక్షురాలు రాధాకుమారి ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. బాజీసైదా, వెంకటేశ్వర్‌రెడ్డి, మహిళా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్యామిలీ డే వేడుక


ఇన్, అవుట్ గేమ్ ఆడుతున్న మహిళలు

మందమర్రిరూరల్: ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సింగరేణి ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏరియా జీఎం దేవేందర్, సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపారాణి హాజరై ప్రారంభించారు. మహిళలకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ ప్రాంగణంలో అధిక సంఖ్యలో మహిళలు బతుకమ్మ పాటలతో డ్యాన్స్‌లు చేశారు.

కాసిపేట 2గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాసిపేట 2గనిని సందర్శించి మంగళవారం కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ కేంద్ర నాయకులు వెల్థి సుదర్శన్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఫిట్ నాయకులు చొప్పరి రామస్వామి, ప్రభాకర్ తదితరులున్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ


బతుకమ్మతో చిన్నారి

చెన్నూర్: సద్దుల బతుకమ్మ వేడుకలు చెన్నూర్ పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శివాలయం, పద్మశాలి భవనం, పాత బస్టాండ్ ముదిరాజ్ కాలనీ, కొత్తగూడెం కొండపోచమ్మ ఆలయం, బట్టిగూడెం లక్ష్మీదేవర ఆలయాల వద్ద మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ సందడిగా గడిపారు. చెన్నూర్‌లో ఆనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఏడు రోజులలోనే సద్దుల బతుకమ్మ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని మహిళలు తెలిపారు. అనంతరం పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): క్యాతన్‌పల్లి మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో మంగళవారం బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జంగం కళ, మున్సిపల్ వైస్ చైర్మన్ మురళీకృష్ణ హాజరై ప్రారంభించారు. బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చెన్నూర్ బట్టిగూడెం కాలనీలో...


చెన్నూర్ పద్మశాలి భవనంలో...



అ'పూర్వ' సమ్మేళనం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా, అదే పాఠశాలలో మంగళవారం కలుసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, చిన్ననాటి తీపి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఆహ్వానించి వారిని సన్మానించారు.

ప్రజల రక్షణకే 'కార్డన్ సెర్చ్'


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: ప్రజల రక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ట్యాంక్‌బస్తీలో మంగళవారం మందమర్రి, దేవాపూర్, రామకృష్ణపూర్ పోలీస్ సిబ్బంది, నార్కోటిక్ డాగ్ ఫోర్స్‌తో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో పాల్గొని మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు ఉంటున్నారా, అపరిచిత వ్యక్తులకు షెల్టర్ ఇస్తున్నారా అనే కోణంలో ఆధార్, గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. ద్విచక్ర, ఆటో రిక్షాల పత్రాలు తనిఖీ చేసి పత్రాలు సక్రమంగా లేని 36ద్విచక్ర వాహనాలు, 2ఆటోలను గుర్తించి సీజ్ చేశారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. బెల్టుషాప్‌లో తనిఖీ చేయగా రూ.7వేల మద్యం దొరకగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పనులు పరిశీలిస్తున్న కమిషనర్

చెన్నూర్: సద్దుల బతుకమ్మ వేడుకల కోసం మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పనులను మున్సిపల్ కమిషనర్ గంగాధర్ పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇప్ప రాజ్‌కుమార్ ఉన్నారు.


ఆర్కే 7 గనిలో యజ్ఞంలో పాల్గొన్న అధికారులు


మహా చండీయాగంలో భక్తులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

చెన్నూర్/మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్)/కాసిపేట/శ్రీరాంపూర్/మంచిర్యాలఅర్బన్: అమ్మవారి నవరాత్రోత్సవాల్లో భాగంగా వాడవాడల్లో నెలకొల్పిన అమ్మవారి ప్రతిమలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.దుర్గామాతను ప్రతిరోజు ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. మంగళవారం పలు చోట్ల కుంకుమపూజలు, అన్నదానాలు, హోమం, యాగాలు చేశారు. ఆయుధపూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, మందమర్రి జీఎం దేవేందర్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేనేజర్ స్వామిరాజు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు,డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ఎస్కే బాజీసైదా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


కాసిపేట: పాల్గొన్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, జీఎం దేవేందర్


చెన్నూర్: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సంక్షిప్త వార్తలు

బీజేపీ నాయకుల సంబురాలు

చెన్నూర్: హర్యానాలో బీజేపీ ఘన విజయం సాధించడంపై పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచాలు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, గర్రెపల్లి నర్సయ్య, తుమ్మ శ్రీపాల్, రాపర్తి వెంకటేశ్వర్, మానికరావు శంకర్, లక్ష్మీనారాయణరెడ్డి, అడప శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో చోటు

జన్నారం: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన పీఆర్‌టీయూ సమావేశంలో జన్నారం మండలానికి చెందిన పలువురికి చోటు కల్పించారు. జన్నారం మండలానికి చెందిన పిట్టల రాజారావు, చంద్రశేఖర్‌లకు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నియమిస్తూ పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి ఒక ప్రకటనలో విడుదల చేశారు.

క్రికెట్ పోటీల్లో రెడ్‌జోన్ జట్టు గెలుపు

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో మంగళవారం ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు జరిగాయి. పోటీల్లో రెడ్‌జోన్, రాయల్ చాలెంజ్ జట్లు ఫైనల్‌కు చేరుకుని తలపడగా హోరాహోరీగా సాగిన పోటీలో రెడ్‌జోన్ జట్టు గెలిచింది. గెలిచిన జట్టుకు నిర్వాహకులు బహుమతి ప్రదానం చేశారు.

ఘనంగా డాక్టర్ బాలగోపాల్ వర్ధంతి

మంచిర్యాలటౌన్: మానవ హక్కుల వేదిక ప్రొఫెసర్ డాక్టర్ బాలగోపాల్ వర్ధంతిని మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

హన్‌మాన్ ఆలయంలో పూజలు

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి నాయకపుగూడలోని హన్‌మాన్ ఆలయంలో భక్తులు మంగళవారం యాగం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మందమర్రిరూరల్: ఊరుమందమర్రిలో మా ఊరు సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పది మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.